సాక్షి తిరుపతి

బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



ముగిసిన గిరీశ్వరయ్య తిరుణాల

డక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లిలో వెలసిన స్తంభాల గిరీశ్వరయ్యస్వామి తిరుణాల మంగళవారం ఘనంగా ముగిసింది. - 8లో



పోటులో మరమ్మతులు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలోని పోటులో చిన్నచిన్న మరమ్మతులు చేపట్టారు. బండరాళ్లను తీసుకెళ్లే పనులు ఊపందుకున్నాయి.

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	40	23
చిత్తూరు	39	22
తిరుమల	35	19
గూడూరు	40	24
నగరి	40	23

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం(సా)	సహర్ గురువారం(ఉ)
తిరుపతి	6.28	4.41
చిత్తూరు	6.30	4.40
పుంగనూరు	6.32	4.44

రంగేసి.. దోచేసి!



మేడిపండు చూడు మేలిమై ఉండు.. పొట్ట విప్పిచూడు పురుగులుండు.. చందంగా మారింది మార్కెట్లో బియ్యం పరిస్థితి. సంచులకు రకరకాల రంగులద్ది అందులో నాసిరకం బియ్యం నింపి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులు బ్రాండెడ్ పేరుతో వినియోగదారులను బోల్తాకొట్టిస్తున్నారు. కొత్తరకం బ్రాండ్ అంటూ మార్కెట్లో పరిచయంచేసి నిలువునా దోచుకుంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సాగుతున్న ఈ నకిలీ బియ్యం దందాపై ఏ ఒక్క అధికారీ కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- విచ్చలవిడిగా నకిలీ బియ్యం విక్రయాలు
- రేషన్‌బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి అమ్మకాలు
- బ్రాండెడ్ బ్యాగుల్లో నింపి అంటగడుతున్న వ్యాపారులు
- ఇష్టారాజ్యంగా ధరలు .. తనిఖీలు చేయని అధికారులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న బియ్యపు బస్తాలు

సాక్షి, తిరుపతి/చిత్తూరు రూరల్: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో 3,002 రేషన్‌షాపులు ఉండగా వీటి కింద 11 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి నెలకు 25 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం అవసరం. ఇందులో కొందరు వినియోగదారులు వ్యాపారులకు విక్రయిస్తుండగా.. మరి కొంతమంది అక్రమార్కులు రేషన్‌షాపుల వద్దే పాగా వేసి బియ్యాన్ని కిలో రూ.9 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత ఆ బియ్యాన్ని పాలిష్ చేసి సన్నబియ్యంగా మార్చి వాటికి ఓ బ్రాండ్ పేరుపెట్టి మార్కెట్లోకి తీసుకొస్తున్నారు. శ్రీ ఆహార్, బుల్లెట్, ఐరావత్, రాయల్ బుల్లెట్, సత్యసాయి బ్రాండ్ల బియ్యానికి మంచి గుర్తింపు ఉండగా.. ఆ బ్రాండ్ల అసలు వ్యాపారులు వేరు. ఇవే పేర్లతో కొందరు నకిలీలు రంగంలోకిదిగి యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. అలాగే సన్న బియ్యంగా తయారు చేసేటప్పుడు వచ్చే పిండిని కూడా పశులకు దాణాగా అమ్మేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇలా వ్యాపారులు రెండు రకాలుగా ఆదాయం పొందుతూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు.

ఏ'మార్చేస్తారు'!

గింజ పరిమాణం ఎలా కావాలంటే అలా తయారు చేసే ఆధునిక యంత్రాలు ప్రస్తుతం అందుబాటులోకొచ్చాయి. రూ.కోటి నుంచి రూ.2.5 కోట్ల విలువ చేసే సార్టెక్స్ యంత్రాలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు బియ్యం విక్రయాల్లో అనేక మోసాలకు పాల్పడుతున్నారు. ఎక్కువగా శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు, తిరుపతి, చంద్రగిరి, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, జీడీనెల్లూరు, నియోజకవర్గాల్లో ఈ దందా నడుస్తోంది. బ్రాండెడ్ బియ్యానికి మాత్రమే ట్యాక్స్.. నాన్ బ్రాండెడ్ బియ్యానికి ట్యాక్స్ లేదని జీఎస్టీ కౌన్సిల్ తీర్మాణం ఇచ్చింది. ఇదే అదనుగా నకిలీలు బ్రాండెడ్ పేరుతో ఇటు వినియోగదారులను.. అటు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. 25 కిలోల బ్యాగ్ అయితే ప్రభుత్వానికి 5 శాతం జీఎస్టీ చెల్లించాలి. 26 కిలోల బ్యాగ్ అయితే జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే ఎక్కడా ఈ నకిలీ బ్రాండ్ వ్యాపారులు జీఎస్టీ చెల్లించడం లేదు. విక్రయాలు సాగిస్తున్న వ్యాపారుల పూర్తివివరాలు బ్యాగ్‌పై ముద్రించాలి. అయితే నకిలీ బ్రాండ్ రైస్ వ్యాపారులు తయారు చేసిన బ్యాగ్‌లపై అడ్రస్ కూడా ఉండడంలేదు. ఒరిజనల్ బ్రాండ్ వ్యాపారులు రైస్ మిల్లు అడ్రస్, ఫోన్ నంబర్‌ను బ్యాగ్‌పై ముద్రించాల్సి ఉంది. ఆహార్ బ్రాండ్ రైస్ బ్యాగ్‌పై ఓనర్ ఫొటో కూడా ముద్రిస్తారు. 50 కిలోల బ్యాగ్ ఎక్స్‌పోర్ట్‌కు ట్యాక్స్ అవసరం లేదు. కొన్ని వ్యాపార దుకాణాల్లో 25, 26 కిలోల బస్తా 23, 24 కిలోలు ఉంటోంది. అయినా అటువైపు తూనికలు కొలతలశాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ధరల్లో తలోదారి

పదేళ్ల కిందట ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,500 నుంచి 2వేల బియ్యం దుకాణాలు ఉండగా.. ప్రస్తుతం అవి ఏడు వేలకుపైగా చేరాయి. తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం గడించే వ్యాపారం కావడంతో పలువురు వ్యాపారులు, మిల్లర్లు కలిసి ఈ దందాకు తెరలేపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్వాలిటీ ఉండే బియ్యాన్ని కిలో రూ.35 మించి బహిరంగ మార్కెట్లో విక్రయించకూడదు. ఓ పేరు మోసిన బ్రాండ్ కిలో బియ్యాన్ని రూ.60కి అమ్ముతుంటే.. ఎటువంటి గుర్తింపు, అనుమతులు లేని మరికొంత మంది వ్యాపారులు కిలో బియ్యం రూ.55 విక్రయిస్తున్నారు. 25 కిలోలు, 26కిలోల బస్తా బియ్యం రూ.1,300–రూ.1,500 వరకు పలుకుతోంది.

బ్రాండెడ్ రకాలు

- శ్రీ ఆహార్ (ఎస్ఆర్ఐ) (గురజాల) రూ.1400
- బుల్లెట్ (26 కిలోల బ్యాగ్) (నాగపూర్, మహారాష్ట్ర)
- ఐరావత్ (సూళ్లూరుపేట)
- సత్యసాయి (సూళ్లూరుపేట)
- బీపీఎల్ మ్యాంగో (బనగానపల్లి)
- వాసవి



ఇవి మార్కెట్‌లో లభిస్తున్న వివిధ బ్రాండ్‌లకు సంబంధించిన బియ్యం. ఇందులో కొన్ని బ్రాండ్‌ల పేర్లు కొద్దిగా మార్చి వినియోగదారులను బోల్తాకొట్టిస్తున్నారు.

ఫిర్యాదులు అందలేదు

బియ్యం బ్యాగుల్లో తక్కువ, ఎక్కువ వంటి కంప్లైంట్స్ లేవు. ఫిర్యాదులొస్తేనే తనిఖీలు చేస్తాం. ఇక బ్రాండ్ల పేరుతో అమ్ముతున్నారా? లేదా? అనే విషయాలు మా పరిధిలోకి రావు.

– సుధాకర్, తూనికలు కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్

ఫిర్యాదు చేయండి

రేషన్ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి అమ్ముతుంటే నేరుగా తమకు ఫిర్యాదు చేయొచ్చు. తనిఖీలో అది నిజమని తేలితే చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యంతో దందా చేసేవారిని వదలం. క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. – శంకరన్, డీఎం

న్యూస్‌రీల్

ఘనంగా పూలే జయంతి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో మంగళవారం మహాత్మా జ్యోతీరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన బడుగుబలహీన వర్గాలకు చేసిన సేవలను కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి కొనియాడారు. ఆయనతోపాటు డీఆర్వో శ్రీనివాసరావు, తుడా వీసీ హరికృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, జిల్లా పశువైద్యాధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్టీసీ డీపీటీవో కార్యాలయంలోనూ పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో చెంగల్‌రెడ్డితోపాటు ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య, అర్జున్, తులసీరెడ్డి పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఈబీసీ నేస్తం

– జిల్లాలో 19,401 మందికి లబ్ధి

తిరుపతి అర్బన్: ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం నగదు జమచేయనుంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా, మార్కాపురం నుంచి ప్రారంభించనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మంగళవారం పేర్కొన్నారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి కార్యక్రమాన్ని వీక్షించే విధంగా ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. మూడు విడతల్లో రూ.15 వేల వంతున రూ.45 వేలు ఆర్థిక సహాయం అందించడంలో భాగంగా వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమతోపాటు మిగిలిన ఓసీ సామాజికవర్గానికి చెందిన నిరుపేద మహిళలు 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు అందజేస్తారని తెలిపారు. ఒక్కో విడతలో రూ.15 వేల చొప్పున పంపిణీ చేస్తున్నట్టు ఆయన వివరించారు. రెండవ విడతలో భాగంగా జిల్లాలో 19,401 మందికి రూ.29.13 కోట్ల మేర లబ్ధిచేకూరనున్నట్టు తెలిపారు.

నిధుల మంజూరుపై చర్చ

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అశోక్‌కుమార్‌తో నిధుల మంజూరుపై ఎంపీ గురుమూర్తి చర్చించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా జారీచేసిన మార్గదర్శకాలను వివరించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తిచేస్తే తదుపరి నిధుల కేటాయింపులు ఉంటాయన్నారు.

ఘనంగా ముగిసిన సాహిత్య బ్రహ్మోత్సవాలు



ధ్రువపత్రాలు అందుకున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో రెండు రోజులుగా చేపట్టి ప్రపంచ తెలుగు సాహిత్య బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో దేశ నలుమూలల నుంచి వివిధ రంగాలకు చెందిన 2,860 మంది కళాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. 36 మంది రచయితలు పుస్తకాలను ఆవిష్కరించారు. ముగింపు సమావేశంలో ఇరు సంస్థల చైర్మన్లు కత్తిమండ ప్రతాప్, కింగ్ ఇంద్ర మాట్లాడుతూ తొలి సారిగా 48 గంటల పాటు నిర్వహించిన ఈ సాహిత్య, కళా ప్రదర్శనల కార్యక్రమాన్ని అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్, టీఎస్‌ఏ బుక్ ఆఫ్ రికార్డ్, కల్చరల్ టాలెంట్స్ బుక్ ఆఫ్‌రికార్డ్స్‌లో నమోదయినట్టు పేర్కొన్నారు. ఈమేరకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, కమిటీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్‌తో అభివృద్ధికి బాటలు

- మనం కాదు.. మన పనులు మాట్లాడాలి
- అభివృద్ధి గురించి భవిష్యత్ చెప్పుకోవాలి
- కనీవిని ఎరుగని రీతిలో తిరుపతి గంగజాతర
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, పక్కన మేయర్ శిరీష, కమిషనర్ హరిత

తిరుపతి తుడా : తిరుపతి నగర విస్తరణ, కనెక్టివిటీ పెంచడం, తద్వారా సుమారు 4వేల ఎకరాల్లో అభివృద్ధికి బాటలు వేసేలా మాస్టర్‌ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్టు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఈ రోడ్ల అభివృద్ధితో రూ.40వేల కోట్ల సంపద సృష్టిస్తుందన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో మంగళవారం సుదీర్ఘంగా నిర్వహించారు. మేయర్ శిరీష అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్‌కు ప్రత్యేక ఆహ్వానితుల హోదాలో హాజరైన ఎమ్మెల్యే భూమన మాట్లాడారు. రహదారుల అభివృద్ధితో నగర తూర్పు భాగంలో రూ.50 వేలు అంకణం ఉన్న ధర ఇప్పుడు రూ.3 లక్షలకు పెరిగిందన్నారు. ఏ నగరంలోనూ నాలుగేళ్లలో ఈ స్థాయిలో అభివృద్ధి, సంపద సృష్టించిన దాఖలాలు లేవన్నారు. మాటలు కాకుండా మనం చేసే అభివృద్ధే మాట్లాడాలన్నారు. మరోనాలుగైదేళ్లలో మాస్టర్ ప్లాన్ రోడ్ల పరిధి నుంచి కార్పొరేషన్‌కు వందల కోట్ల ఆదాయ వనరులు సమకూరుతాయన్నారు. హైదరాబాద్ రింగ్ రోడ్డులో వైఎస్సార్‌కు ఎంత ప్రతిష్ట వచ్చిందో మనం నిర్మిస్తున్న 14 మాస్టర్ ప్లాన్ రోడ్లతో అంత ప్రతిష్టను అందుకోనున్నట్టు చెప్పారు. తిరుపతి కార్పొరేషన్‌లోకి విలీనమైన శెట్టిపల్లి అభివృద్ధికి కౌన్సిల్ రూ.2 కోట్ల మేర ఆమోదం తెలిపినట్టు ఆయన గుర్తుచేశారు. చెన్నారెడ్డి కాలనీలోని కుంట చరిత్రను ఆధారాలతో ఎమ్మెల్యే వివరించారు.

రాష్ట్ర పండుగగా గంగజాతర


వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన తిరుపతి గంగమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్టు ఎమ్మెల్యే భూమన వివరించారు. ఈ ఆలయ పునఃనిర్మాణ పనుల్లో భాగంగా తవ్వకాల్లో ఆరవ శతాబ్దం నాటి రాతి స్తంభాలు, చోళులు, విజయనగర సామ్రాజ్య కాలం నాటి రాతిస్తంభాలను పురావస్తుశాఖ గుర్తించిందన్నారు. ఈ ఆలయం అత్యంత ప్రాచీనమైనదని నిర్ధారణ అయిందన్నారు. దేశంలోనే తొలి జాతర తిరుపతి గంగజాతరగా ప్రసిద్ధి చెందిందన్నారు. సారె సంప్రదాయం 450 సంవత్సరాలకు ముందే కొనసాగిందన్నారు. కలరా మహమ్మారి అనేకమార్లు ఊర్లకు ఊర్లే కనుమరుగు చేయగా తిరుపతిలో గంగమ్మ తల్లి చలువ వల్ల అలాంటి విపత్తు ఎప్పుడూ రాలేదన్నారు. ఆలయ పునఃనిర్మాణానికి దేవదాయశాఖ రూ.12 కోట్లు, టీటీడీ రూ.2 కోట్లు భాగస్వామ్యంతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఆలయ చరిత్రను బట్టి రాష్ట్ర పండుగగా అనుమతివ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరగా ఆయన సమ్మతించారన్నారు. గంగజాతరకు టీటీడీ రూ.50లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్ రూ.25 లక్షలు, తుడా రూ.25 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.30 లక్షలు ఇవ్వాలని కోరినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్రతిపాదనలు పంపండి

తిరుపతి అర్బన్: 2024లో జరగబోవు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కొత్తగా మ్యానుఫ్యాక్చర్ చేసిన బెల్‌ఎం3 ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, వీవీ ప్యాట్‌లను భద్రపరచడానికి కొత్త జిల్లాల్లో గోడౌన్లను గుర్తించి వాటి ప్రతిపాదనలను పంపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా ఆదేశించారు. 13 కొత్త జిల్లాల కలెక్టర్లతో విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో ఆయన సమీక్ష నిర్వహించగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కే వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. జూన్‌లో ఈవీఎంల ప్రాథమిక స్థాయి తనిఖీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేణిగుంట మండలం, కొత్తపాలెం గ్రామ పరిధిలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి గోడౌన్‌ను పరిశీలించామన్నారు. డీఆర్వో శ్రీనివాసరావు హాజరయ్యారు.

ఘన నివాళి





తిరుపతిలో జ్యోతీరావ్ పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష

తిరుపతి జిల్లాలో మహాత్మా జ్యోతీరావ్‌పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తుచేసుకుని అంజలి ఘటించారు. సమాజంలో అసమానతలను రూపుమాపడానికి ఆయన నిరంతరం కృషి చేశారని కొనియాడారు. సమసమాజ స్థాపనే లక్ష్యంగా ఆయన ముందుకు సాగారని తెలిపారు. కులవివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి పూలే అని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన విశేష సేవలందించారన్నారు. ఆయన అడుగుజాడల్లో నేటి యువత పయనించాలని వారు ఆకాంక్షించారు. – సాక్షి, తిరుపతి

పది ప్రాంతాల్లో పాదరక్షల కౌంటర్లు

తిరుమల: తిరుమలలో భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాదం కాంప్లెక్స్, ప్రధాన కళ్యాణ కట్ట కాంప్లెక్స్‌లలో పాదరక్షలు భద్రపరిచే కౌంటర్లను మంగళవారం టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుమలకు విచ్చేసే భక్తుల పాదరక్షలు భద్రపరచడానికి టీటీడీ పలు ప్రాంతాల్లో కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భక్తుల పాదరక్షలను భద్రపరచడానికి, టీటీడీ పది ప్రాంతాల్లో కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ప్రస్తుతం రెండు కౌంటర్లు ప్రారంభించామన్నారు. ఈ కౌంటర్లలో భక్తులు నంబర్ ఉన్న బ్యాగ్‌లను తీసుకొని పాదరక్షలను ఉంచి, దారంతో కట్టి, అదే నంబర్ ఉన్న రాక్‌లో ఉంచాలన్నారు. భక్తుడికి ర్యాక్ – బ్యాగ్‌తో సమానమైన నంబర్‌తో టోకెన్ జారీ చేస్తారని, భక్తులు తిరిగి వచ్చిన తర్వాత టోకెన్ ఇచ్చి పాదరక్షలు పొందవచ్చని చెప్పారు. శ్రీవారి సేవకుల ద్వారా టోకెన్లు జారీ చేయనునట్లు తెలిపారు. కాగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం వద్ద 1187 ర్యాక్‌లు, ప్రధాన కల్యాణ కట్ట వద్ద 4 వేల ర్యాక్‌లను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. త్వరలో పీఏసీ–1, 2, 3, నారాయణగిరి క్యూలైన్లు, రాంభాగీచా, సుపదం, ఏటీసీ సర్కిల్, వీక్యూసీలో పాదరక్షల భద్రపరిచే కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, కల్యాణకట్ట, అన్నప్రసాదం డిప్యూటీ ఈఓ సెల్వం, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, వీజీవో శ్రీ బాలిరెడ్డి, క్యాటరింగ్ స్పెషల్ ఆఫీసర్ శాస్త్రి పాల్గొన్నారు.



పాదరక్షల కౌంటర్‌ను ప్రారంభిస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

ముగిసిన స్తంభాల గిరీశ్వరయ్య తిరుణాల


పార్వతీపరమేశ్వర్ల గ్రామోత్సవం


పౌరాణిక నాటకాలను తిలకిస్తున్న భక్తులు

దక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లిలో వెలసిన స్తంభాల గిరీశ్వరయ్యస్వామి తిరుణాల మంగళవారంతో వైభవంగా ముగిసింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు వేలాది మంది భక్తులు శివ పార్వతులను దర్శించుకున్నారు. భక్తజనంతో దేవునివెల్లంపల్లి కిటకిటలాడింది. తెల్లవారుజామున ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పూలరథంపై ఆశీనులు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. రథాన్ని మోసేందుకు భక్తులు పోటీపడ్డారు. మంగళవారం రాత్రి ఉత్సవమూర్తులకు తెప్పోత్సవం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ నర్రావుల ప్రకాశనాయుడు, ఈఓ శ్రీధర్‌నాయుడు ఏర్పాట్లను పరిశీలించారు.

తిరుణాళ్లలో హుండీ రాబడి రూ.9.9 లక్షలు

స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపు జరిగింది. తిరుణాళ్ల రాబడి రూ.9లక్షల 90వేలు వచ్చినట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గూడూరు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీలత, ఆలయ చైర్మన్ నర్రావుల ప్రకాశంనాయుడు, ఈఓ శ్రీధర్‌నాయుడు, లయ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం


స్టిక్కర్లు అంటిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, వైద్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం మండలంలోని రాజులపాళెంలో జరిగిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా..? అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబోస్, వైఎస్సార్ సీపీ నాయకులు రత్నయ్య, మురళి, రమేష్, హరిబాబు, వెంకటరత్నం, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్ కుటుంబానికి ఇంటి స్థలం


వీరజవాన్ తల్లికి ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: కార్గిల్ వార్‌లో సత్యవేడుకు చెందిన సైనికుడు ఎం.మోహన్ అమరుడయ్యారు. ఆయన కుటుంబానికి తహసీల్దారు టీవీ సుబ్రమణ్యం కొత్తమారికుప్పం పరిధిలో 5 సెంట్ల డీకేటీ పట్టాను మంజూరు చేశారు. మంగళవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా వీరజవాన్ తల్లి సరస్వతికి కొత్తమారికుప్పం సర్వే నం.388-5లో ఐదు సెంట్లు భూపట్టాను అందజేశారు. ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ జ్యోతి

శ్రీకాళహస్తి రూరల్: సమీకృత వ్యవసాయం రైతులకు లాభదాయకమని, దీనిపై అవగాహన కల్పించి ప్రోత్సహిద్దామని డీఆర్‌డీఏ పీడీ జ్యోతి అన్నారు. శ్రీకాళహస్తిలోని ఈటీసీలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో పది జిల్లాలకు చెందిన ఎఫ్‌పీఓ, డీపీఎంలు, ఏపీఎంలకు ప్రమోషన్ ఆఫ్ ఇంటిగ్రేట్ పార్మింగ్ క్లస్టర్స్‌పై రెండు రోజులు శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పీడీ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ సమూహాలను ప్రోత్సహించడం ద్వారా లాభసాటిలో వ్యవసాయం కొనసాగుతుందన్నారు. గత 20 సంవత్సరాలుగా పెర్ప్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయని, దీన్నికూడా విజయవంతం చేయాలని సిబ్బందిని కోరారు. ఎన్‌ఐఆర్‌డీ రీసోర్స్ పర్సన్ గోపాలకృష్ణ, ఈటీసీ ప్రిన్సిపల్ నాగపద్మజ, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసులు, ఏరియా కో–ఆర్డినేటర్ డా.పి.డాంగేయాదవ్, సింగన్న, మునెయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించిన ఎంపీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

రేణిగుంట: రేణిగుంట సమీపంలోని కేంద్రీయ విద్యాలయం–2ను తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి మంగళవారం సందర్శించారు. అక్కడి సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తొలుత ఆయన తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. స్కూల్లో పర్మినెంట్ ఉపాధ్యాయులు లేరని, అలాగే వాష్‌రూములు అపరిశుభ్రంగా ఉన్నాయని విద్యార్థులు వివరించారు. ఎంపీ స్పందిస్తూ సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,360
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,570
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,600
రిటైల్ వెండి గ్రాము	రూ.78.60

రేపు సీనియర్స్ మెన్ క్రికెట్ సెలెక్షన్స్

తిరుపతి ఎడ్యుకేషన్ : చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం తుమ్మలగుంటలోని వైఎస్సార్ క్రీడా మైదానాల్లో సీనియర్స్ మెన్ క్రికెట్ సెలెక్షన్స్ జరగనుంది. ఆ మేరకు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాడ శ్రీనివాసులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 8గంటలకు తెల్లని దుస్తులతో పాటు సొంత క్రీడా సామగ్రి, ఆధార్‌కార్డు, ఫార్మ్ 5, బర్త్ సర్టిఫికెట్‌తో హాజరవ్వాలని కోరారు. పూర్తి వివరాలకు జిల్లా క్రికెట్ కోచ్‌లు ఆర్‌కె.మురుగన్‌ను 98490 26131, చిన్నబాబు 79818 80381 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

సీజ్‌చేసిన బియ్యానికి బహిరంగ వేలం

తిరుపతి అర్బన్ : అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన 500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కలెక్టరేట్‌లోని పౌరసరఫరాల అధికారివారి కార్యాలయంలో మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి ఎంపీ ప్రసాద్, జిల్లా మేనేజర్ వై.సుమతి, ఏఎస్‌వో రెడ్డిచంద్రిక సమక్షంలో వేలం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 11 మంది వ్యాపారులు పాల్గొన్నారు. ఇందులో కడపకు చెందిన శ్రీనివాసులు వేలం ద్వారా బియ్యాన్ని దక్కించుకున్నారు. కేజీ బియ్యం రూ.26.50 చొప్పున ప్రభుత్వానికి ఆయన చెల్లించాల్సి ఉంది.

అడవి పందిని ఢీకొని స్కూటరిస్టు మృతి

చంద్రగిరి: అడవి పందిని ఢీకొన్న ఘటనలో ద్విచక్రవాహన దారుడితోపాటు అడవి పంది కూడా మృతి చెందిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయరహదారి కాశిపెంట్ల సమీపంలో మంగళవారం తెల్లవారిజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరు సమీపంలోని కట్టమంచికు చెందిన గజపతి(42), తిరుపతిలోని బంధువు ఇంటికి వచ్చి పనులు ముగించుకుని మంగళవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై చిత్తూరుకు బయల్దేరాడు. కాశిపెంట్ల సమీపంలో వెళ్తున్న క్రమంలో అడవి పంది రోడ్డు దాటుతుండగా గజపతి పందిని బలంగా ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పంది కూడా అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పందిని స్వాధీనం చేసుకుని, పంచనామా నిర్వహించి అధికారుల సమక్షంలో కాల్చివేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేల బావిలో పడి దివ్యాంగుడి మృతి


బావి వద్ద గుమికూడిన జనం

చిల్లకూరు: మాటలు రాని ఓ యువకుడు ప్రమాదవశాత్తు నేల బావిలోపడి మృతి చెందిన సంఘటన మండలంలోని తీపనూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని తీపనూరు గ్రామానికి చెందిన గుంటపూడి వెంకటేశ్వర్లు కుమారుడు శ్రీనివాసులు(19)కు చిన్నతనం నుంచి మాటలు రావు. దీనికితోడు పూర్తిగా వినపడదు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాల వారు గ్రామ సమీపంలో ఉన్న పొలాల వద్ద పొంగలి పెట్టేందుకు వెళ్లారు. ఆ యువకుడు వారితో వెళ్లి పొలాల్లో ఉన్న నేలబావిలో ప్రమాదవశాత్తు పడి గల్లంతయ్యాడు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడి మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పోలీసుల విచారణ

కోట: సైబర్‌క్రైంకు సంబంధించి కోట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం హర్యాణా పోలీసులు విచారణ చేపట్టారు. హర్యాణాకు చెందిన ఓ యువతి అకౌంట్ నుంచి రూ.13 లక్షల నగదు తస్కరించిన ఘటనపై వివరాలు సేకరించారు. వంజివాకకు చెందిన ఓ ఎస్టీ కుటుంబానికి చెందిన వ్యక్తి ఫోన్‌కు మెసేజ్ వచ్చినట్లు గుర్తించి కోట పోలీస్‌స్టేషన్‌లో విచారణ జరిపారు. కాగా దీనిపై పూర్తి ఆధారాలు లభించలేదని ఎస్‌ఐ పుల్లారావు తెలిపారు.

గంజాయి పాపం చంద్రబాబుదే


ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : రాష్ట్రంలో గంజాయి సాగును పెంచి పోషించింది చంద్రబాబే అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అక్రమ సంపాదనకు అలవాటు పడిన టీడీపీ నేతలే గంజాయి సాగు చేస్తున్నారన్నారు. వారి పాపంలో చంద్రబాబుకు కూడా వాటా ఉందని తెలిపారు. టీడీపీ మునిగిపోయే నావని, దాన్ని తెడ్డేసి నిలబెట్టాలని లోకజ్ఞానం లేని లోకేష్ ఆరాటపడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వంపై బురదచల్లడమే లక్ష్యంగా చంద్రబాబు, లోకేష్ కుటిల రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ హెరిటేజ్ ఫ్యాక్టరీ కోసం పాడి రైతులకు వరంలాంటి విజయ డెయిరీని మూసివేయించారని తెలిపారు. ఇప్పుడు పాడి రైతులకు అండగా నిలిచేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమూల్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారని వివరించారు. పదవీ కాంక్షతో చంద్రబాబు రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కుప్పం సైతం వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని స్పష్టం చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





తిరుమల శ్రీవారి ఆలయం వెలుపల సినీ నటుడు కబీర్ దుహాన్ సింగ్, కేంద్రమంత్రి హరిదీప్ సింగ్ పూరి, అంబికా అధినేత అంబికా కృష్ణ, తెలంగాణ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం సినీ నటుడు కబీర్ దుహాన్‌సింగ్, కేంద్రమంత్రి హరిదీప్ సింగ్‌పూరి, అంబికా అధినేత అంబికా కృష్ణ, తెలంగాణ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

మా భవిష్యత్ నువ్వే!


పల్లెల్లో పండగ వాతావరణం కనిపిస్తోంది. ఇంటింటా ఆత్మీయత తొణికిసలాడుతోంది. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించేందుకు.. సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు వస్తున్న నేతలకు అడగడుగునా ఆదరణ లభిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం ఎర్రావారిపాళెం మండలంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన మహాపాదయాత్రకు అపూర్వ స్పందన లభించింది. ఇంటింటికీ అతికించిన స్టిక్కర్లకు అవ్వాతాతలు నమస్కరించడం, ప్రేమతో పిల్లలు సీఎం జగన్ చిత్రాన్ని ముద్దాడడం కనిపించింది. - భాకరాపేట

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి



మృతి చెందిన సోనియ, సోనియ ఫైల్

నారాయణవనం: నారాయణవనంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో 9వ తరగతి విద్యార్థిని సోనియ(15) మృతి చెందింది. పోలీసుల కథనం.. మండలంలోని బ్రాహ్మణ తాంగాళ్ దళితవాడకు చెందిన వెంకటేష్ కుమార్తె సోనియ స్థానిక బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. మంగళవారం ఉదయం 7 గంటలకు నారాయణవనంలో ప్రైవేట్ ట్యూషన్ సెంటర్ నుంచి సైకిల్‌పై ఇంటికి బయలు దేరింది. జాతీయ రహదారి బైపాస్ భీమునిచెరువు రోడ్డులోకి క్రాస్ చేస్తుండగా చెన్నై నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోనియాకు తీవ్ర గాయాలయ్యాయి. కూడలి వద్ద ఉన్న స్థానికులు పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి బాలిక మృతదేహానికి నివాళి అర్పించారు. బాలిక కుటుంబ సభ్యులను ఓదార్చారు. కారును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఘనంగా కల్చరల్ ఫియస్టా ప్రారంభం


విరించి కార్యక్రమంలో విద్యార్థినులు

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో విరించి–2023 పేరుతో ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ స్థాయి కల్చరల్ ఫియస్టా మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా విద్యార్థినులకు మిస్ విరించి–2కే23, బ్లెండ్ ఆర్ట్, జుగాడ్, స్ప్రింక్ల్ ఆఫ్ క్లే, టర్న్ అండ్ కోట్, ది బ్రిలియంట్ బ్రష్, నృత్య హ్యాష్‌ట్యాగ్‌లు, మెమ్ కాంటెస్ట్, ఆన్ ది హంట్, రాగా, మెహందీ, స్నాప్‌షాట్, రంగోలి, రైజ్ టు ఫేమ్ వంటి పోటీలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


విరించి–2కే23లో..